సాక్షి ఒడిశా

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,35,909

బంగారం : 7 గ్రాముల 150 మిల్లీ గ్రాములు

వెండి : 362 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



50 కిలోల గంజాయి..

మల్కన్‌గిరిలో 50 కిలోల గంజాయి పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

- IIలో▸



సమస్యలు పరిష్కరించాలి

రైతుల సమస్యలు పరిష్కరించాలని వక్తలు అన్నారు. సమస్యలపై సమావేశం నిర్వహించారు.

- IIలో▸

రంగంలోకి ఆదమ్య

- ఇండియన్ కోస్ట్ గార్డ్ సరికొత్త గస్తీ నౌక ఆదమ్య ప్రారంభం
- పారాదీప్‌లో ప్రారంభోత్సవం



పారాదీప్ ఓడ రేవులో గస్తీ నౌక అదమ్య సేవలు ప్రవేశ పెట్టిన ఇండియన్ కోస్ట్ గార్డ్



భువనేశ్వర్: భారత దేశ సముద్ర భద్రతను బలోపేతం చేసే దిశగా భారత తీర రక్షక దళం (ఐసీజీ) శుక్రవారం అధునాతన గస్తీ నౌక ఆదమ్య సేవల్ని ప్రారంభించింది. పారాదీప్ ఓడ రేవు తీరంలో ఏర్పాటు చేసిన నిరాడంబర కార్యక్రమంలో ఈ నౌక సేవల్ని ప్రారంభించారు. భారత దేశ రక్షణ తయారీలో పెరుగుతున్న స్వావలంబనకు ప్రతీకగా ఆదమ్య 60 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. రమారమి 52 మీటర్ల పొడవున్న ఈ నౌక, గంటకు దాదాపు 50 కిలో మీటర్లకు సమానమైన 27 నాట్ల వేగంతో పయనించేందుకు 2 అధిక శక్తివంతమైన డీజిల్ ఇంజిన్లతో తయారైంది. నడి సముద్రంలో బహుళ సవాళ్లను ఎదుర్కోవడానికి దీనిలో అధునాతన ఆయుధాలు, సంభాషణ వ్యవస్థలు, ఆధునిక నిఘా సాంకేతికతతో తయారు చేశారు. ఆదమ్య నౌకలో 30 ఎంఎం సీఆర్ఎన్ – 91 గన్, అగ్ని నియంత్రణ వ్యవస్థలతో కూడిన రెండు 12.7 ఎంఎం స్టెబిలైజ్డ్ రిమోట్ కంట్రోల్ గన్లు, ఇంటిగ్రేటెడ్ బ్రిడ్జ్ సిస్టమ్ (ఐబీఎస్), ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐపీఎంఎస్), ఆటోమేటెడ్ పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీఎంఎస్) వంటి అత్యాధునిక సాంకేతికత వ్యవస్థతో శక్తివంతంగా తయారైంది.

కోస్ట్ గార్డ్ అధికారుల అభిప్రాయం ప్రకారం ఆదమ్య నౌకను ప్రవేశపెట్టడం వల్ల తూర్పు సముద్ర తీరంలో గస్తీ కార్యకలాపాలు గణనీయంగా మెరుగుపడతాయి. సముద్ర వనరులను కాపాడటం, అక్రమ చేపల వేటను అరికట్టడం, తీరప్రాంత జలాల్లో అక్రమ రవాణా, పైరసీని నిరోధించడం వంటి బహుముఖ పాత్రల కోసం ఈ నౌక దోహద పడుతుంది. తుఫాన్లు, ఇతర సముద్ర అత్యవసర, విపత్కర పరిస్థితులలో గాలింపు, సహాయక కార్యకలాపాల కోసం కూడా దీన్ని మోహరించనున్నారు. మరో వైపు సంఘర్షణ సమయాల్లో ఇది తీరప్రాంత రక్షణను బలోపేతం చేస్తుంది. భారత తీర రక్షక దళం తన నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసింది. మత్స్యకారులకు మద్దతు ఇస్తూ, సహజ వనరులను రక్షించడంతో పాటు, సహజ, మానవ కృత్య ముప్పులకు సమర్థంగా ప్రతిస్పందిస్తూ సురక్షితమైన సముద్ర భద్రతను నిర్ధారించడంలో దేశం యొక్క నిబద్ధతను ఆదమ్య పునరుద్ఘాటిస్తుందని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి.

న్యూస్‌రీల్

గజలక్ష్మి పూజలకు శ్రీకారం



అంకుర పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలోని గాంధీ జంక్షన్ వద్ద గజలక్ష్మి పూజలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అంకుర పూజలు చేసి మొరాట పాతారు. అక్టోబర్ ఏడు నుంచి తొమ్మిది రోజుల పాటు గజలక్ష్మి పూజలు జరగనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. 20 ఏళ్లుగా గాంధీ జంక్షన్ వద్ద ఆడంబరంగా గజలక్ష్మి పూజలు జరుపుతున్నారు.

మూడు ఇసుక లారీలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

రాయగడ: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను సదరు పోలీసులు స్థానిక పితామహాల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఐఐసీ ప్రశన్న కుమార్ బెహర తెలియజేసిన వివరాల ప్రకారం .. శుక్రవారం తెల్లవారున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇసుకను తరలిస్తున్న మూడు హైవా లారీలను ఆపి తనిఖీ చేశారు. అయితే వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. శేఖాల్, పితామహాల్ పంచాయితీ పరిధిల్లోని పత్రాపూర్, ఖిలిమిసిగుడ ప్రాంతంలోని నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్న అనంతరం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. కేసు నమోదు చేసినట్లు బెహర చెప్పారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



చెరువు వద్ద మాల పోడియమి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి మారివాడ పంచాయతీ కూటగూడ గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందాడు. కూటగూడ గ్రామానికి చెందిన మాల పోడియామి (30) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం స్నానానికి వెళ్లాడు. నీరు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. సమీపంలో ఉన్న వారు చూసి కేకలు వేసి అందరినీ పిలవగా వారు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కోరుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ హిమాంశు శంకర్ బారిక్ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి పంపించారు.

శాసన సభ వీధిలో అబల అలజడి



అలజడి రేపిన అబలని అదుపులోకి తీసుకున్న రక్షక దళాలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో శుక్రవారం రెండో రోజు వానా కాలం సమావేశాలు ప్రారంభమైన తరుణంలో వెలుపల నడి రోడ్డు మీద ఓ మహిళ దూకుడు తీవ్ర అలజడి రేపింది. రక్షక దళాల్ని పరుగులు తీయించింది. దీర్ఘ కాలంగా తన గోడు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంతో తాడోపేడో తేల్చుకుందామనే దృఢ సంకల్పంత అసెంబ్లీలో సమావేశాల ప్రాంగణం లోనికి ప్రవేశించేందుకు సాహసంతో ప్రయత్నించింది. సమయస్ఫూర్తితో మహిళా రక్షక దళం స్పందించి ఆమెని అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి శాంతియుతంగా గట్టెక్కింది.

జాజ్‌పూర్‌కు చెందిన ఒక మహిళ దీర్ఘకాలిక సమస్యల తక్షన పరిష్కారం కోసం శాసన సభ లోనికి చొరబడటానికి చేసిన ప్రయత్నం నాటకీయ నిరసనగా పలువురి దృష్టిని ఆకట్టుకుంది. భారీ భద్రత వలయం ఛేదించుకుని శాసన సభ భవనం వైపు దూసకుపోయేందుకు ప్రయత్నించింది. సకాలంలో పోలీసులు గుర్తించి ఆమెను అడ్డుకున్నారు. తన ఫిర్యాదులను వినిపించేందుకు వానా కాలం సమావేశాల ప్రాంగణానికి వెళ్తున్నానని పోలీసులకు వివరించింది. ఆమె జాజ్‌పూర్ నుంచి వచ్చిన సరస్వతిగా గుర్తించారు. తన వాహనాన్ని బలవంతంగా అమ్మేశారని, దీని పట్ల బాధ్యులైన వారి వ్యతిరేకంగా చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని దీర్ఘ కాలంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వర్గాలకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఫిర్యాదుల విభాగం ద్వారా తాను పదే పదే చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలై పరిష్కారం కాలేదని ఆమె బాహాటంగా ఆరోపించింది. గతంలో పోలీస్ కమిషనర్, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఇద్దరినీ కలిసి తన గోడుని వివరించినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు తన ఫిర్యాదును తీవ్రంగా పరిగణించి తక్షణ చర్యలు చేపట్టాలని అభ్యర్థించింది. స్థానిక క్యాపిటల్ ఠాణా పోలీసులు ఆమెని బుజ్జగించి శాసన సభలోకి చొరబాటు నివారించారు. ఠాణాలో ఆమె సమస్యపట్ల విచారణ చేపట్టారు. సత్వర చర్యలతో సముచిత న్యాయం జరిగేలా చేస్తామని అభయం ఇచ్చి ఊరడించారు.

• విజిలెన్స్ దాడులు



సోదాలు చేపడుతున్న అధికారులు



అంతర్యామి సాహు

రాయగడ: జిల్లా అటవీ శాఖ పరిధిలో కాసీపూర్ అటవీ శాఖ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న అంతర్యామి సాహు ఇంట్లో జయపురం విజిలెన్స్ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు నిర్వహించారు. సాహుకు సంబంధించిన కంధమాల్, నయాగర్, గంజాం, రాయగడ తదితర 9 ప్రాంతాల్లో ఉన్న ఆస్తులపై ఏక కాలంలో దాడులు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ విభాగానికి చెందిన ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు, తొమ్మిది మంది ఏఎస్‌ఐలు బృందాలుగా విడిపోయి 9 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. దీనిలో భాగంగా కంధమాల్ జిల్లా బలిగుడ, దారింగిబడి ప్రాంతాల్లో విలువైన మూడు భవనాలు, బరంపురంలోని టెక్నో పార్క్ సమీపంలో 1,650 చదరపు అడుగుల భవనాన్ని, బలిగుడలో మరో ఆరు స్థలాలను అధికారులు గుర్తించి వాటికి సంబంధించిన పత్రాలను సీజ్ చేశారు. ఇంకా దాడులు కొనసాగిస్తున్నట్లు సమాచారం .

కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హక్కుల ఉల్లంఘన తీర్మానం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో మీడియాకు సమాచారం జారీ చేసింది. ఈ చర్యపై ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా అధికార పక్షం భారతీయ జనతా పార్టీ సభ్యుడు పద్మలోచన్ పండా ప్రత్యేకాధికారాల ఉల్లంఘన తీర్మానాన్ని సభలో ప్రతిపాదించారు. ఆయన రామచంద్ర కదమ్, తారా ప్రసాద్ బాహినీపతి, సోఫియా ఫిర్దౌస్, అశోక్ దాస్, సీ. ఎస్. రాజన్ ఎక్కా సహా 5 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యతిరేకంగా ఈ తీర్మానం ప్రతిపాదించారు. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయాన్ని సభలో అధికారికంగా ప్రకటించకముందే మీడియాకు తెలియజేయడం ద్వారా కాంగ్రెస్ సభ్యులు శాసన సభ నియమాలను ఉల్లంఘించారని ఈ తీర్మానం ఆరోపిస్తోంది. స్పీకర్ ప్రకటనకు ముందు మీడియాతో తీర్మానంపై చర్చించడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హక్కులను ఉల్లంఘించారని బీజేపీ సభ్యుడు పద్మలోచన్ పండా ఆరోపించారు. ఈ చర్య శాసన సభ నియమాలు, విధానాలను ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు రామచంద్ర కదమ్ ఈ చర్యను ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నంగా తోసిపుచ్చారు. 'అవిశ్వాస తీర్మానం తీసుకురావడంలో మేము ఎటువంటి నియమాలను ఉల్లంఘించలేదు. మేము ఏమి చేసినా నిబంధనల పరిధిలోనే ఉంది' అని ఆయన నొక్కి చెప్పారు.

• సభ వాయిదా



నిరసన ప్లకార్డులతో స్పీకరు పీఠం చుట్టుముట్టిన బీజేడీ సభ్యులు

భువనేశ్వర్: శాసన సభ వానా కాలం సమావేశాలు రెండో రోజున మొక్కుబడిగా 4 నిమిషాలు మాత్రమే జరిగాయి. రాష్ట్రంలో ఎరువుల సంక్షోభంపై సభలో గందరగోళ పరిస్థితులు తాండవించాయి. ప్రధానంగా విపక్ష బిజూ జనతా దళ్ ఎరువుల సంక్షోభంతో ప్రభుత్వాన్ని నిలదీయడంతో సభలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ శీర్షికతో ప్రత్యేక చర్చకు అనుమతించాలని కోరుతూ స్పీకర్‌ను నిలదీయడంతో పరిస్థితి అదుపు తప్పింది. స్పీకరు అభ్యర్థనల్ని పక్కకు నెట్టి బిజూ జనతా దళ్ సభ్యులు స్పీకరు పీఠం చుట్టుముట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ స్థానాల నుంచి లేచి నిరసన తెలిపారు. విపక్ష సభ్యుల అంతరాయాలతో సభ అర్ధంతరంగా ముగిసింది. ప్రశ్నోత్తరాల ఆరంభం నుంచి సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితి నియంత్రణ కోసం స్పీకరు సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే బీజేడీ సభ్యులు మరోసారి వెల్‌లోకి దూసుకెళ్లి రాష్ట్రంలో ఎరువుల సంక్షోభంపై ప్రత్యేక చర్చకు డిమాండ్ చేస్తూ గందరగోళం సృష్టించారు. సభను సజావుగా నిర్వహించేందుకు అనుకూలత కొరవడి స్పీకర్ సురమా పాఢి మర్నాడు శనివారం ఉదయం 10 గంటల వరకు నిరవధికంగా వాయిదా వేశారు.

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న ఎరువుల సంక్షోభంపై వివరణాత్మక చర్చ జరగాలని బిజూ జనతా దళ్ డిమాండ్ చేసింది. ఎరువుల నల్ల మార్కెటు ధోరణి రైతులను మరింత వేధిస్తుంది. ఎరువుల సంక్షోభంతో రైతులు వీధుల్లోకి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దిశలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేసి సభా ప్రాంగణాన్ని మారు మోగించారు. రాష్ట్ర ప్రభుత్వం 'రైతు వ్యతిరేకి' అని ఆరోపించారు. ఆందోళన విరమించి సభ్యులను తమ సీట్లకు తిరిగి వెళ్లాలని స్పీకరు పదే పదే చేసిన అభ్యర్థనలు లెక్క చేయకుండా విపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో సభా కార్యక్రమాల్ని వాయిదా వేయడం అనివార్యమైనట్లు పేర్కొన్నారు.

హబిష్యాలిలకు ఉచిత వసతి, ఆహారం



హబిష్యాలి భవన సముదాయం



హబిష్యాలి భవనంలో ఉచిత సౌకర్యాలు

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసంలో జరుపుకునే ప్రత్యేక వ్రతం కోసం పలు ప్రాంతాల నుంచి విచ్చేసే హబిష్యాలీలకు సకల సదుపాయాలు కల్పించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి హబిష్యాలి భవన సముదాయంలో ఈ సౌకర్యాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఫ్రీజీట్టటజీఛ్లి.౯ాఛీజీటజ్బి.జౌరి.జీ ౩ లో ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. 2,500 మంది పేర్లు నమోదయ్యే వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయం నిరవధికంగా కొనసాగుతుంది. గత సంవత్సరం మాదిరిగానే, హబిష్యాలిలకు ఉచిత వసతి, ఆహార సదుపాయాలతో ప్రత్యేక జగన్నాథ సులభ దర్శనం నెల రోజుల పాటు నిరవధికంగా కల్పిస్తారు.

కరుణ, సానుభూతితోనే..
సమాజ పునర్నిర్మాణం



థియోసాఫికల్ ఆర్డర్ ఆఫ్ సర్వీస్ (టీఓఎస్) యొక్క 12వ ప్రాంతీయ సమావేశంలో గవర్నర్ ప్రసంగం



విజేతలకు బహుమతులు అందజేసిన గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి



థియోసాఫికల్ ఆర్డర్ ఆఫ్ సర్వీస్ (టీఓఎస్) యొక్క 12వ ప్రాంతీయ సమావేశంలో గవర్నర్‌తో పాల్గొన్న ఇతర ప్రముఖులు

భువనేశ్వర్: కరుణ, సానుభూతి అత్యంత శక్తివంతమైన పరివర్తన సోపానాలని, ఈ లక్షణాలు కుటుంబాలు, సమాజాలు, దేశాలను పునర్నిర్మించగల 'జీవన శక్తులు'గా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి అభివర్ణించారు. స్థానిక రమా దేవి మహిళా విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన ఒడిశా ప్రాంతపు థియోసాఫికల్ ఆర్డర్ ఆఫ్ సర్వీస్ (టీఓఎస్) యొక్క 12వ ప్రాంతీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విభజన అడ్డంకులు క్రమంగా కనుమరుగు చేసేందుకు ప్రేమ, సేవా భావాల వారధుల నిర్మాతలుగా విద్యార్థులు ఎదగాలన్నారు. సేవ, జ్ఞానం, కరుణ కలిసి సత్యం, సామరస్యం, సార్వత్రిక సోదరభావాన్ని నిస్వార్థతకు అతీతంగా విలువైన భవిష్యత్ తరాన్ని రూపొందిస్తాయన్నారు. 'గోడలను కాదు, వంతెనలను నిర్మించడంలో కరుణ, సానుభూతి' అనే సదస్సు ఇతివృత్తాన్ని ప్రస్తావిస్తూ, వేగవంతమైన సాంకేతిక మార్పు, భౌతిక పురోగతి తరచుగా నైతిక, ఆధ్యాత్మిక విలువలను కాలరాస్తాయని డాక్టర్ హరిబాబు కంభంపాటి పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు నిస్వార్థ సేవ, సార్వత్రిక విలువలను స్వీకరించాలని ప్రోత్సహించారు. సమావేశంలో గవర్నర్ సమావేశ ఇతివృత్తంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు, బెసెంట్ నిస్వార్థ సేవా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రచురించిన జ్ఞాపిక సంచికని ఆవిష్కరించారు. టీఓఎస్ జాతీయ డైరెక్టర్ కె. శివప్రసాద్, అధ్యక్షురాలు దీపా పాఢి ప్రసంగించారు.

రక్తదానం సామాజిక బాధ్యతకు ప్రతీక: గవర్నర్



రక్త దాతలతో రాష్ట్ర గవర్నర్



రక్త దాన శిబిరం సందర్శనలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి



రక్తదాత యువతకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన గవర్నర్

భువనేశ్వర్: ప్రాణాలను కాపాడడంలో రక్తదానం సామాజిక భాగస్వామ్యంగా నిలుస్తుందని, లబ్ధిదారులకు ప్రతి రక్తపు బొట్టు పునరుజ్జీవింపజేసే స్ఫూర్తిదాయక చర్యగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి అన్నారు. రాజ్ భవన్ న్యూ అభిషేక్ హాల్‌లో జరిగిన రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఈ శిబిరాన్ని రాజ్ భవన్ డిస్పెన్సరీ, క్యాపిటల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు, పౌర సమాజ సంస్థల సభ్యులు, రాజ్ భవన్ సిబ్బంది, అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో 170 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. గవర్నర్ దాతలతో వ్యక్తిగతంగా సంభాషించి వారి మానవతా స్ఫూర్తిని అభినందించారు. ప్రశంసా చిహ్నంగా దాతలకు సర్టిఫికెట్లు, టీ షర్టులను అందజేశారు. ఈ శిబిరం రక్తాన్ని సేకరించడమే కాకుండా యువతలో స్వచ్ఛంద రక్తదానం గురించి అవగాహన కల్పించడం కూడా లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాజ్ భవన్ డిస్పెన్సరీ డాక్టర్ బీకే మెహర్, క్యాపిటల్ హాస్పిటల్ రక్త నిధి డాక్టర్ దేబాశిష్ మిశ్రా సమన్వయంతో ఈ శిబిరం విజయవంతంగా నిర్వహించారు.

క్లుప్తంగా

బైకు చోరీ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష

రాయగడ: బైకు చోరీ కేసుకు సంబంధించి రాయగడ ఎస్‌డీజేఎం వర్షాదాస్ శుక్రవారం విచారించి అందుకు సంబంధించిన ముగ్గురు నిందితులను మూడేళ్ల జైలు శిక్ష విధిస్తు తీర్పు నిచ్చారు. అదేవిధంగా నిందితులు అదనంగా మరో పది వేల రూపాయల జరిమానా చెల్లించాలని, చెల్లించలేని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన స్థానిక ప్రేమ్ పహాడ్ సమీపంలో బైకు చోరీ జరిగిందని బాధితుడు రోహిత్ కౌసల్య సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అరజు పిడిక, సహదేవ్ మండంగి, బిజయ్ మండిలను అరెస్టు చేసి కొర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి ఎస్‌డిజేఎం దాస్ సాక్షులను విచారించిన మీదట తీర్పును వెల్లడించారు.

నమో యువ మారథాన్ జెర్సీ ఆవిష్కరణ


నమో యువ మారథాన్ జెర్సీ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా ఈ నెల 21న నిర్వహించనున్న 'నమో యువ మారథాన్' జెర్సీని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ శుక్ర వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రాష్ట్రం, దేశ పురోగతికి వెన్నెముక అని తెలిపారు. యువతను వ్యసనాల నుండి విముక్తి చేయడానికి విస్తృత అవగాహన అవసరమన్నారు. మత్తు ముక్తి భారత్ సందేశంతో నిర్వహిస్తున్న ఈ సామూహిక పరుగులో పెద్ద సంఖ్యలో యువ జన సంఘాలు, విద్యార్థులు చేరాలని పిలుపునిచ్చారు.

పంచాయతీగా గుర్తించండి


వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి పరిధి బందేరి గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలని 24 గ్రామాలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని కలిసి వినతిపత్రం అందజేశారు. 4,500 జనాభా గల ఈ గ్రామం సమీపంలో మరో 24 గ్రామాలు ఉన్నాయని, అందువలన బందేరి గ్రామాన్ని పంచాయతీగా గుర్తిస్తే అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు.

స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోరుకు సిద్ధం


రన్నింగ్‌ట్రాక్‌పై మార్కింగ్ వేయిస్తున్న పీడీ, పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం వేదికగా శనివారం జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరగనున్నాయి. డివిజన్ స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో ఎంపికైన బాలబాలికలు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరికి వేర్వేరుగా రన్స్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ అధికారుల నేతృత్వంలో రన్నింగ్ ట్రాక్, ఇతర కోర్టులను సిద్ధం చేసి తుది మెరుగులు దిద్దారు. బేస్‌బాల్ ఎంపికలు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం సాఫ్ట్‌బాల్ అండర్-14,17,19 వయో విభాగాల్లో ఎంపికలను పూర్తిచేశారు. మరోవైపు, పతకాలే లక్ష్యంగా క్రీడాకారులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి వినతులు స్వీకరించారు. 40 వినతులు రాగా.. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, హ్యాండ్ స్టిక్కులు, వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఎ.డి. శ్రీధర్ రాజా, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి మరమ్మతులు



ఉత్తమ సేవలు అందించిన వారిని అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

● జిల్లా కలెక్టర్ కులకర్ణి

రాయగడ: పాత టౌన్, కొత్త టౌన్‌లను అనుసంధానించే ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశం హాల్‌లో జరిగిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, ఆర్‌టీవో బినయ్ కుమార్ పవుల్, ఎంబీఏ పి.దుర్గా ప్రసాద్ రావు, అదనపు జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ మమత చౌదరి, రాయగడ ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంబికేయ మిశ్రా, ఎన్‌హెచ్ డివిజన్ (సునాబెడ) ఇంజనీర్ సౌమ్యర్జిని శెఠి, టిఐ (రాయగడ) ఝుసకేతన్ భొరొసాగొరొయా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి మరమ్మతులకు సంబంధించి పనులు ప్రారంభించిన తరువాత ఎటువంటి జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని లేదంటే ట్రాఫిక్ సమస్యలతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 163 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా ఇందులో 97 మంది మృత్యువాత పట్టారని ఆర్‌టీవో బినయ్ కుమార్ పవుల్ తెలిపారు. 73 మంది గాయాలపాలయ్యారని వివరించారు. జిల్లాలో ప్రధాన, జాతీయ రహదారుల పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వాటికి మరమ్మతులు చేపడితే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించి వారి ప్రాణాలు కాపాడే విషయంపో స్పందించిన ఎనిమిది మందికి ఈ సందర్భంగా కలెక్టర్ జ్ఞాపికతలో సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

రాయగడ: జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి భవనంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలిపొందిన విద్యార్థులకు పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నట్లు జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి సుస్మిత బౌరి తెలియజేశారు.


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

సభలో లిఖితపూర్వక ప్రశ్నోత్తరాలు

భువనేశ్వర్: శాసన సభ వానా కాలం సమావేశాలు ఒడిదొడుకుల మధ్య అరకొరగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా సభ ఆరంభంలో కొనసాగాల్సిన కీలకమైన ప్రశ్నోత్తరాలకు నిరవధికంగా గండి పడుతుంది. ఈ నేపథ్యంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సభలో లిఖితపూర్వక సమాధానాలు సంబంధిత మంత్రులు ప్రవేశ పెడుతున్నారు.

మహానది దిగువ ప్రాంతంలో 17 ఆనకట్టల నిర్మాణం

విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే ప్రశాంత్ బెహెరా అడిగిన ప్రశ్నకు సమాధానంగా మహానది దిగువ ప్రాంతంలో 17 ఆనకట్టలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి సభలో తెలిపారు. 15 అంతర్ నదీ జలాశయ ప్రాజెక్టులు మరియు 44 బ్యారేజీలు నిర్మిస్తారు. కేంద్ర ప్రభుత్వం వీటి కోసం చర్యలు తీసుకుంటోందని, నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఐదేళ్లలో 27,167 మంది దుర్మరణం

రోడ్డు ప్రమాదాల కారణంగా మరణాలు నిరంతరం మరణాలు పెరుగుతున్నాయి. అధికార పక్షం సభ్యుడు టొంకొధొరొ త్రిపాఠి అడిగిన ప్రశ్నకు రవాణా మంత్రి సమాధానంగా గత ఐదేళ్లలో రోడ్డు ప్రమాదాల్లో 27,167 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 5,0041 మంది గాయపడ్డారు. 2020 నుండి 2024 వరకు ఐదేళ్లలో అత్యధికంగా ప్రాణాలు కోల్పోయారు. 2024లో మాత్రమే 6 వేల 142 మంది ప్రాణాలు కోల్పోయారు.

1,404 అధ్యాపక పోస్టులు ఖాళీ

రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ సభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో 1,404 బోధన సిబ్బంది పదవులు, 260 అధ్యాపకులు, 453 అనుబంధ అధ్యాపకులు, 669 సహాయ అధ్యాపక పదవులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అత్యధిక సంఖ్యలో పోస్టులు కటక్ రెవెన్షా విశ్వ విద్యాలయంలో అత్యధిక ఖాళీలు ఉండగా ఉత్కళ విశ్వవిద్యాలయం తదుపరి స్థానంలో ఉందన్నారు. 17 విశ్వవిద్యాలయాల్లో 2,286 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

17 విశ్వ విద్యాలయాల్లో వేధింపులు పెరిగాయి.

రాష్ట్రంలోని 17 విశ్వ విద్యాలయాల్లో శారీరిక, మానసిక, లైంగిక వేధింపులు పెరిగాయి. ఈ నేపథ్యంలో వేధింపులకు గురైన 19మంది విద్యార్థినులో 6 మంది లైంగిక వేధింపులకు, 9 మంది మానసికంగా మరో 2 మంది అసభ్య ప్రవర్తనకు గురైనట్లు ఉన్నత విద్యా మంత్రి సూర్యవంశీ సూరజ్ సభలో బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే తుషార్‌కాంతి బెహెరా అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

నకిలీ సర్టిఫికెట్ల ఉపాధ్యాయులపై చర్యలు

నకిలీ ధృవపత్రాలు దాఖలు చేసి ఉద్యోగాలు పొందిన 424 మంది ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించింది. బాలాసోర్ జిల్లాలో 20 మంది ప్రాథమిక ఉపాధ్యాయులను తొలగించారు. వారిలో నలుగురు కోర్టును ఆశ్రయించారు. శాసన సభలో బీజేడీ ఎమ్మెల్యే సుభాషిణి జెనా లేవనెత్తిన ప్రశ్నకు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద్ గోండ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పాఠశాలలు పునఃప్రారంభం

రాష్ట్రంలో 4 వేల 619 ప్రాథమిక పాఠశాలలు మూసివేశారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం 46 పాఠశాలలను తిరిగి తెరిచింది. మరో 5 పాఠశాలల పునఃప్రారంభం దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని విభాగం మంత్రి నిత్యానంద్ గోండ్ సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 105 మండల విద్యాధికారులు (బీఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద్ గోండ్ అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

మొక్కజొన్నతో ఇథనాల్ ఉత్పత్తి


మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సుధీర్

రణస్థలం: మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా సాగు చేసే రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ అన్నారు. లావేరు గ్రామంలో పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం, పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఇంధన అవసరాల దృష్ట్యా మొక్కజొన్న వంటి పునరుత్పాదక వనరులతో ఇంధనం ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి మేలు కలగడమే కాక, మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయని చెప్పారు. మొక్కజొన్న విత్తే సమయంలో ఎరువులు వేయడం లేదని, శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువుల వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అయితే మోతాదుకు మించి నత్రజని ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చులు పెరగడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. మొక్కజొన్న పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం క్షీణిస్తుందని, దానికి బదులు పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, సీనియర్ మేనేజర్ పి.తవిటినాయుడు, పెద్దాపురం పరిశోధన స్థానం సిబ్బంది హఫీజా, సమన్వయకర్తలు ఎస్.సాయిదుర్గ, ఐ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: నౌతళ గ్రామానికి చెందిన వాడారి అప్పన్న(49) పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడారి అప్పన్న మద్యానికి బానిస కావడంతో భార్య అన్నపూర్ణ వద్దని వారించేది. ఈ క్రమంలో భార్యాభర్తలు శుక్రవారం గొడవపడ్డారు. వెంటనే అప్పన్న నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

బారువలో అగ్ని ప్రమాదం

సోంపేట : బారువ కుమ్మరిపేట వీధిలో తెప్పల ముకుందరావు ఇంట్లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అనుమానిస్తున్నారు. సోంపేట అగ్నిమాపక శాఖాధికారి సూర్యారావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ.నాలుగు లక్షల యాభై వేల విలువైన వస్తువులు కాలిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అగ్నిమాపకాధికారి

టెక్కలిపాడులో చైన్‌స్నాచింగ్

జలుమూరు: టెక్కలిపాడులో శుక్రవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన జలుమూరు ఎర్రమ్మ గ్రామ శివారులో దుస్తులు ఉతుకుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడును తెంచుకుని నరసన్నపేట వైపు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయం కావడంతో ఎవరూ లేరని, కేకలు పెట్టినా ఫలితం లేకపోయిందని బాధితురాలు వాపోయింది. జలుమూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితురాలు తెలిపింది.

అంబేడ్కర్ వర్సిటీకి గ్రీన్ ఆడిట్ గుర్తింపు


గుర్తింపు పత్రాలతో వర్సిటీ వీసీ, సిబ్బంది

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి మొదటిసారి గ్రీన్ ఆడిట్ గుర్తింపు లభించింది. ఈ మేరకు జీసీ కన్సల్టెంట్ సర్వీసెస్ (గోరఖ్‌పూర్-ఉత్తరప్రదేశ్) వర్సిటీకి సమాచారం అందజేసింది. వచ్చే ఏడాది నాక్ పరిశీలనకు సన్నద్ధమవుతున్న అంబేడ్కర్ వర్సిటీ పలు గుర్తింపుల కోసం ప్రయతిస్తోంది. అందులో భాగంగా జీసీ కన్సల్టెంట్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ విశాక్ శ్రీవాత్సవ్ నేతృత్వంలోని బృందం ఈ ఏడాది జూలై 22, 23 తేదీల్లో క్యాంపస్‌లో పర్యటించి వర్సిటీలోని బోధన, పరిపాలన, పరిశోధన, సేవలు, సౌకర్యాలు, పర్యావరణ సంబంధిత అంశాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు వర్సిటీ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ప్రశంసిస్తూ గ్రీన్ ఆడిట్ యూనివర్సిటీగా గుర్తింపునిచ్చారు. అదే విధంగా, క్వాలిటీ, ఎన్విరాన్‌మెంట్, ఎనర్జీ, ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్స్, మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కేటగిరీల్లో 2025 విద్యాసంవత్సరానికి ఐఎస్‌ఓ గుర్తింపునిస్తూ సర్టిఫికెట్ సైతం జారీచేశారు. వర్సిటీ ఐక్యూఏసీ విభాగం ఈ పర్యటనను పర్యవేక్షించి వారికి అవసరమైన పూర్తిస్థాయి సమాచారం అందజేశారు. కాగా వర్సిటీ ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రెడ్డి తిరుపతిరావు, సభ్యులు ఎస్.శ్రీనివాస్, జి.కిరణ్‌కుమార్, పి.మాధవరావులను వర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజినీ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. నాక్ గుర్తింపు మరోసారి పొందేందుకు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఆయా విభాగాలు పూర్తి సమాచారంతో సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని, ఎస్‌ఓ కె.సామ్రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మునిగుడ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం


రాయగడ: గంజాయితో పట్టుబడ్డ నిందితులు


మల్కన్‌గిరి : గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఇద్దరు వ్యక్తుల పట్టుబడ్డారు వారి నుంచి 21.150 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించారు. శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులకు చెందిన బ్యాగులను (సంచులు) తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితుల వివరాలు తెలియాల్సి ఉంది.

50 కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు గురువారం రాత్రి బలిమెల-చిత్రకొండ ముఖ్య రహదారి ఎంవీ 120 గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చిత్రకొండ నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. వారిని విచారించగా బస్తాల్లో గంజాయి దొరికింది. దీంతో ఇద్దరినీ అరెస్టు చేసి బలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. అలానే గంజాయి, బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఐఐసీ ధీరజ్ ఆధ్వర్యంలో తూకం వేయగా 50 కిలోలు ఉంది. దొరికిన ఇద్దరు యువకులు చిత్రకొండ సమితి పురణపల్లి గ్రామానికి చెందిన ధనుంజయ్ ఖీలో, గురుఖీలోగా తెలిసింది.

రైతుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో నాయకులు, రైతులు

జయపురం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వక్తలు అన్నారు. రైతుల సమస్యలపై కృషక్ కళ్యాణ మంచ్ సమావేశం శుక్రవారం నిర్వహించింది. మంచ్ సలహాదారు కె.శ్రీనివాస రావు అధ్యక్షతన జయపురం సమితి జామ్ముండ గ్రామ పంచాయతీ బొదాగుడ గ్రామంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల కోసం చేపడుతున్న పథకాలు, వాటి అమలు తీరు, రైతులు ఎదుర్కుంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి రైతు లబ్ధి పొందేందుకు కృషి చేయాలని వక్తులు అన్నారు. రైతులు ప్రధానంగా ఎరువుల సమస్య ఎదుర్కుంటున్నారని దాన్ని పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. కృషక్ కళ్యాణ మంచ్ సమితి అధ్యక్షులు చిరంజీవి పట్నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర పాణి, కార్యదర్శి కె.శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి గణేష్ గదబ, మొదలగు వారు పలు రైతు సమస్యలపై ప్రసంగించారు. గురురొణ, రఘునాథ్ గదబ, బి.కిరణకుమార్, సమరు భూమియ, ఘాశీ భూమియ,ఘాశీ హరిజన్, భగవాన్ పొరజ, నరశింహ పాత్రో, లక్ష్మణ భూమియ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేసి జిల్లా కీర్తిప్రతిష్ఠతలను చాటిచెప్పాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు శుక్రవారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డుస్థాయిలో 300 మంది వరకు బాలబాలికలు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం సమీపంలోని కె.డి.పాలెం వేదికగా అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి బాలబాలికల సబ్-జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయని సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ, కె.మాధవరావు, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్‌కుమార్, ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, ఎ.డిల్లేశ్వరరావు, పెంటయ్య, పి.రమేష్, ఎస్వీ రమణ, మహంతి, మల్లేశ్వరరావు, తోటారావు, మోహనబాబు, ఐ.గౌరి, వెంకటరమణ పాల్గొన్నారు.


క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

రాష్ట్ర పండుగ ▶ నిధులు లేవుగా!


కొత్తమ్మతల్లి ఆలయం ఇదే..

- ఒక్క రూపాయి కూడా విదల్చని సర్కార్
- కొత్తమ్మతల్లి సంబరాల భారం మళ్లీ అరసవల్లికే..
- ఆదిత్యుని నిధులతోనే పట్టువస్త్రాల సమర్పణ

అరసవల్లి: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలపై పెడుతున్న శ్రద్ధ నిధులు మంజూరు చేయడంలో చూపించడం లేదు. జిల్లాలో గత ఏడాది నుంచి రథసప్తమితో పాటు కొత్తమ్మతల్లి అమ్మవారి సంబరాల ఉత్సవాలను రాష్ట్ర పండుగలంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చడం లేదు. రాష్ట్ర పండుగలంటూ ప్రకటనలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రచారాలకు దిగుతున్నారు తప్ప ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం ఇవ్వడం లేదు. ప్రత్యేకంగా నిధులివ్వం.. సమీపంలో ఉన్న పెద్ద ఆలయాల నిధులను వెచ్చించి పండుగ చేస్కోండి..' అంటూ అధికారిక ఉత్తర్వులు మాత్రం జారీ అయ్యాయి. గతేడాది లాగానే ఈ ఏడాది కూడా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి సంబరాలు అందునా..శతాబ్ది సంబరాల పేరిట ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఎలాంటి ఆర్థిక సహకారం ఉండదని తేల్చేసింది. దీంతో పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్నట్లుగా సర్కార్ తీరుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుంటే ఈఏడాది రథసప్తమి మహోత్సవాలను కూడా తొలిసారిగా రాష్ట్ర పండుగ చేస్తున్నామని ప్రకటించి ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. రాష్ట్ర పండుగ అంటూ..అలాగే 'ప్రసాద్' స్కాం వచ్చేస్తుందంటూ...ఆలయ పరిసరాల్లో ఉన్న అన్ని కట్టడాలను కూల్చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అరసవల్లి ఆలయ పరిసరాలన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

మళ్లీ అరసవల్లి నుంచే..

రాష్ట్ర పండుగంటూ కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయ శతాబ్ది సంబరాలను నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఆర్థిక సహకారం లేకపోవడంతో గౌరవ సాంప్రదాయాల భారమంతా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ నిధులపై పడింది. గత ఏడాది కూడా ఇలాగే అరసవల్లి నుంచే సంప్రదాయక ఖర్చులన్నీ వెచ్చించింది. మళ్లీ ఇప్పుడు కూడా ఈ కొత్తమ్మతల్లి సంబరాల ప్రారంభ ఖర్చు, సంప్రదాయక ప్రక్రియలు, పట్టువస్త్రాలు, ప్రసాదాల ఖర్చు అంతా అరసవల్లి ఆలయంపైనే పడనుంది. అరసవల్లి ఆలయ డిప్యూటీ కమిషనర్/ఈఓ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌ను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమించి కొత్తమ్మతల్లి అమ్మవారి సంబరాల ప్రారంభ రోజున సంప్రదాయక ఉత్సవ నిర్వహణ, ప్రోటోకాల్‌తో పాటు పట్టువస్త్రాల సమర్పణ, గౌరవ లాంఛనాలు, ప్రసాదాల భారమంతా ఆదిత్యాలయ నిధుల నుంచే ఖర్చు చేయనున్నారు. రాష్ట్ర పండుగలంటూ నిధులివ్వకపోవడంపై గతేడాది కొత్తమ్మతల్లి సంబరాల నుంచి కూడా జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టు వస్త్రాలు అందిస్తున్నాం..



కొత్తమ్మతల్లి ఉత్సవాలకు ఈ ఏడాది కూడా అరసవల్లి నుంచి పట్టు వస్త్రాలు, ప్రసాదాలను అమ్మవారికి సమర్పించనున్నాం. రాష్ట్ర పండుగగా కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు చేపడుతున్నాం.

– కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ఈఓ, సూర్యనారాయణ స్వామి ఆలయం, అరసవల్లి

క్లుప్తంగా

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపారాధన



రామతీర్థంలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపం వద్దకు తీసుకువెళ్లి అక్కడున్న ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి దీప కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, రామగోపాలా చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందుతుడి అరెస్టు



నిందితుడు శంకరరావుతో బొబ్బిలిసీఐ నాయణరావు, ఎస్సై సాగర్‌కుమార్

తెర్లాం: మండలంలోని ఎంఆర్ అగ్రహారం గ్రామంలో జరిగిన హత్యకేసులో నిందితుడు నగరపు శంకరరావును శుక్రవారం అరెస్టు చేసినట్లు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు చెప్పారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితుడి అరెస్టు గురించి చెబుతూ పొలం తగాదాలో తనతండ్రినే రాయితో కొట్టి హతమార్చిన చిన్న కొడుకు శంకరరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

బోధనేతర పనులు తప్పించాలి

- ఎస్టీయూ జిల్లా కమిటీ డిమాండ్
- డీఈఓకు వినతిపత్రం అందజేత

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బోధనేతర పనులను విధుల నుంచి తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు శుక్రవారం డీఈఓ యూ.మాణిక్యం నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. 11వ పీఆర్‌సీ గడువు ముగిసి రెండు సంవత్సరాలు అయిందని, 12వ పీఆర్‌సీ కమిషన్ ఇంతవరకు వేయలేదని ఇంకా జప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం నాయకులు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలపై సబ్‌కలెక్టర్ విచారణ



గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో సర్టిఫికెట్లపై విచారణ చేస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో శుక్రవారం సబ్ కలెక్టర్ వైశాలి కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేశారు. గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లను రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రికార్డుల ప్రకారం గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠరావు, రెవెన్యూ సిబ్బంది మరిపల్లి ఎంపీటీసీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కలెక్టర్ గైర్హాజరుపై కమిషన్ అసహనం

శృంగవరపుకోట: జిందాల్ చేసిన భూదందా వ్యవహారంలో న్యాయం చేయాలంటూ నిర్వాసితులు ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని దిల్‌ఖుష్ గెస్ట్‌హౌస్‌లో ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్ విచారణ చేపట్టారు. విచారణకు ఆర్డీవో, తహసీల్దార్లు హాజరైనా కలెక్టర్ హాజరు కాకపోవడంతో కమిషన్ సభ్యుడు అసహనం వ్యక్తం చేస్తూ కలెక్టర్ కదా రావాలి. ఆయన రాకుండా మీరు వచ్చి ఏం చెబుతారన్నారు. అందుకు ఆర్డీవో సమాధానమిస్తూ వేర్వేరు పనుల వల్ల కలెక్టర్ హాజరుకాలేదని చెప్పగా, వాటికన్నా ఈ విషయం ప్రాధాన్య అంశం కదా. గిరిజనుల భూములు తీసుకుని, కంపెనీ పెట్టకుండా, ఉపాధి లేకుండా చేయడం అన్యాయం కాదా అని కమిషన్ సభ్యుడు వ్యాఖ్యానించినట్లు కమిషన్ ఎదుట హాజరైన జిందాల్ నిర్వాసిత రైతులు దేవాపురపు శ్రీరాములు, బంగారు రమణలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు మొండిచేయి

- నిర్లక్ష్య ధోరణిలో విద్యుత్ సంస్థల యాజమాన్యం
- సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలి
- విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ విద్యుత్ ఉద్యోగులకు మొండి చేయి చూపింది. కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద జేఏసీలో భాగస్వాములైన సంఘాలన్నీ ముఖ్య సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లేందుకు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ముఖ్యంగా డిస్ట్రిబ్యూషన్ కంపెనీల యాజమాన్యం కార్మిక చట్టాలకు, విద్యుత్ బోర్డు విభజనకు ముందు ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా గత ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు. త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం బోర్డు విభజనకు ముందు అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలు, పని ప్రమాణాలు, కారుణ్య నియామకాలు తదితర ప్రయోజనాలు యథావిధిగా కొనసాగుతాయని, ఏవైనా మార్పులు చేయాలంటే ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రస్తుత ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా పరస్పర అవగాహనతో ఒప్పందాలు చేయాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. అందుకు భిన్నంగా వేతన సవరణపై నిర్ణయాలకు మునుపెన్నడూ లేని విధంగా ఒక మాజీ ఐఏఎస్ అధికారిని నియమించారని, పూర్వం నుంచి అమలులో ఉన్న 'వెయిటేజీ' ఫార్ములాను రద్దుచేసి, అతి తక్కువ శాతం (8శాతం) ఫిట్‌మెంట్ బెనిఫిట్‌తో, పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేలు రూపొందించారన్నారు. ఈ పద్ధతి వల్ల ఉద్యోగులు చాలా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటి పైన యాజమాన్యాలతో పలుధపాలుగా చర్చించి నప్పటికీ ఫలితం లేనందున, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి దృష్టికి తెచ్చి, ఆయన సమక్షంలో జరిగిన చర్చల్లో అంగీకరించిన విషయాలపై ఉత్తర్వులు జారీ చేయకుండా తీవ్ర కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యున్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను కూడా యాజమాన్యాలు అమలుచేయకపోవడం ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలి



ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న విత్యుత్ శాఖ సిబ్బందికి పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలి. కారుణ్య నియామకాలు కల్పించడంతో కొత్త పేర్లుపెట్టి ఇస్తున్న పద్ధతిని వెంటనే రద్దు చేసి గత నాలుగు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న పద్ధతినే కొనసాగించాలి. అంతవరకు జేఏసీ ఆదేశాలతో నిరసనలు ఉధృతం చేస్తాం.

వి.లక్ష్మణరావు, విద్యుత్ శాఖ ఉద్యోగుల జేఏసీకన్వీనర్, పార్వతీపురం

సిబ్బంది కొరతతో అధిక ఒత్తిడి..



ఫీల్డ్ విభాగంలో తగినంత సిబ్బంది లేనందున వినియోగదారుల సేవల్లో జాప్యం జరగడంతో పాటు సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. అన్ని విభాగాలలోనూ, ఖాళీలు భర్తీ చేయాలి. అదేవిధంగా అమల్లో ఉన్న పని ప్రమాణాల ప్రకారం అదనపు పోస్టులు మంజూరు చేయాలి.

ఆర్.శ్రీధర్, బ్రాంచ్ సెక్రటరీ

విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలి



దీర్ఘకాలిక సర్వీసు గల వారందరినీ విద్యుత్ సంస్థలలో విలీనం చేయాలి. అర్హులైన ఇతర సర్వీసులకు చెందిన ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజినీర్ ఖాళీల్లో నియమించాలి. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజినీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతిలో అవకాశం కల్పించాలి

ఎస్.వెంకటేశ్వర్లు, బ్రాంచ్ ప్రెసిడెంట్

మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు ఫెక్సీల చించివేత

నెల్లిమర్ల: మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు పుట్టిన రోజు సందర్భంగా నెల్లిమర్ల నగర పంచాయతీలో పలు చోట్ల వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఏర్పాటు చేసిన ప్లెక్సీలను తొలగించి, చించేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసి నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్టేట్‌బ్యాంకు సమీపంలో, రామతీర్థం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ప్లెక్సీలను పూర్తిగా తొలగించారన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ సమీపంలో, మిమ్స్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్లెక్సీలను చించేశారని చెప్పారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, తదితరులు

ఆశ వర్కర్ మెడలో చైన్ చోరీ

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస పంచాయతీ పరిధిలోని కొండపాలవలస గ్రామ సమీపంలో ఓ మహిళ మెడలో చైన్ లాగేసి చైన్‌స్నాచర్స్ ఉడాయించారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన ఆశ వర్కర్ వంగపండు పుష్ప శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సొంత పని నిమిత్తం తన స్కూటీపై రామభద్రపురం వస్తుండగా అదే సమయంలో ద్విచక్రవాహనంపై బాడంగి వైపు వెళ్తున్న ఇద్దరు గుర్తు తెలియని దుండగలు స్కూటీపై వెళ్తున్న ఆమె దగ్గరగా వాహనంతో వెళ్లి మెడలోని చైన్, చెవిదిద్దులు సుమారు 4 తులాలు పైబడి ఉన్న బంగారం తెంపేసి ఉడాయించారు. దీంతో స్కూటీపై నుంచి ఆమె కింద పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి.అలాగే మెడ తెగిపోయింది. కొద్ది దూరంలో ఉన్న స్థానికులు గమనించి వచ్చి కింద పడిన ఆమెను లేపి ప్రథమ చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. బాధితురాలు పుష్ప ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేయగా ఇన్‌చార్జి ఎస్సై తారకేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీన్నర గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీసులు గురువారం రాత్రి కేజీన్నర గంజాయిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సై లక్ష్మీ ప్రసన్న కుమార్, సిబ్బంది నగరంలోని దుప్పాడ వద్ద గంజాయి పీలుస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. జొన్నగుడ్డికిచెందిన నలుగురు నగరశివారు దుప్పాడలోని ఓపొలంలో గంజాయి పీలుస్తున్నట్లు పోలీసులకు సమాచారం రాగా సీఐ చౌదరి ఆదేశాల మేరకు వన్‌టౌన్ ఎస్సై, సిబ్బంది దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలి



కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురం టౌన్: ఎన్నికల్లో విద్యార్థులకు, విద్యారంగానికి ఇచ్చిన హామీల అమల కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారం కోసం మార్గం చూపాలని ఏఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తాం విద్యార్థులకు ఏ కష్టాలు ఉండవు. వారికి అండగా నేనుంటానని హామీ ఇచ్చిన నారా లోకేష్ హామీలు అమలుపరచకుండా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని మండిపడ్డారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిచ్చి అనంతరం సీఎం కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హరికష్ణ, చరణ్, వికాస్, సుధీర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్‌కు పోటెత్తిన వినతులు

- సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు



గ్రీవెన్స్‌సెల్ ప్రాంగణంలో వినతులను తయారు చేసుకుంటున్న ఉద్యోగులు



ఉద్యోగుల వినతులను సమీక్షిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి 40 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల నుంచి అందిన జిల్లాస్థాయి వినతులు వెంటనే పరిష్కారమ య్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాని వారి సమస్యలను రాష్ట్రస్థాయికి పంపాలని అదే విధంగా పాలసీకి సంబంధించిన వాటిని కూడా ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించారు. ప్రతివారంలో మూడవ శుక్రవారం ఉద్యోగుల కోసం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌లో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అదే వారంలో సమీక్ష చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఉద్యోగుల నుంచి వచ్చిన వినతుల్లో ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.

- డ్వామాలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులు గ్రేడ్ ఫిక్సేషన్, పీఆర్‌సీ, నగదు రహిత హెల్త్ కార్డులను జారీ చేయాలని కోరారు.
- రామవరం, నరవ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు హెచ్‌ఆర్‌ఏ 10 శాతం ఇస్తున్నారని ఇతర శాఖ ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే 16 శాతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వై.రమణ, ఎన్‌జీఓ సంఘం వైస్ ప్రెసిడెంట్ కలెక్టర్‌కు వినతి సమర్పించారు.
- ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు వారికీ బేసిక్ పే మాత్రమే ఇస్తున్నారని డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం లేదని, చట్టం ప్రకారం తమను రెగ్యులర్ చేయాలని సర్వీస్ బ్రేక్ లేకుండా చూడాలని వినతులు అందజేశారు.
- చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ పరిధిలో పనిచేస్తున్న గ్రామ వార్డు గ్రేడ్ ఉద్యోగులు తమకు 4 ఏళ్లు అవుతున్నప్పటికీ రెగ్యులరైజేషన్ చేయలేదని ఇప్పటికీ నెలకు రూ.15 వేల జీతం మాత్రమే ఇస్తున్నారని సర్వీసు రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అర్హత సాధించారు. గత నెల చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరునుగన్న సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. 100, 200 మీటర్ల పరుగు పోటీలో పి.వసంత, ఎం.దివ్య, లాంగ్‌జంప్‌లో పి.నీలిమ, షాట్‌పుట్‌లో ఎ.ఆదిలక్ష్మి, ట్రిపుల్‌జంప్‌లో టి.పాల్‌కుమార్, 5000 మీటర్ల పరుగు పోటీలో ఎం.హరీష్, వాకింగ్‌లో బి.హరీష్, 10000 మీటర్ల రన్‌లో బి.సాయిలు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, ట్రెజరర్ వి.ఆనందకిషోర్‌లు తెలిపారు. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ప్రోత్సహించారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన గిరిజన క్రీడాకారులు



అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన గిరిజన క్రీడాకారులతో కోచ్

శృంగవరపుకోట: మండలంలో పలు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన క్రీడాకారులు సెప్టెంబర్ 5 నుంచి 9 వరకూ నేపాల్‌లోని రంగశాల స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో మాస్టర్ అథ్లెటిక్స్ విభాగంలో సత్తా చాటారు. జిల్లా నుంచి 12 మంది క్రీడాకారులు ఈ క్రీడలకు హాజరైనట్లు కోచ్ చాపా రామచంద్రరావు చెప్పారు. వారిలో మండంగి శ్రీనివాసరావు 10కి.మీ పరుగు, 5కి.మీ నడక పోటీల్లో స్వర్ణపతకాలు సాధించారని తెలిపారు. అలాగే జీలకర్ర జయరాం 200మీ రన్నింగ్‌లో స్వర్ణం, కె.నరేష్ 400మీ, 200మీ రన్నింగ్‌లో స్వర్ణపతకాలు, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రోలో పి.కోటేశ్వరరావు స్వర్ణ పతకాలు, జె.పోలిరాజు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, తాంగుల మంగ్లూ 800మీ రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో స్వర్ణాలు, డి.చంద్రకాంత్ 400మీ రన్నింగ్‌లో స్వర్ణం, బి.చంద్రరావు 400మీ రన్నింగ్‌లో రజత పతకాలు సాధించారని తెలియజేశారు. వారంతా కాయకష్టం చేసే గిరిజనులు అయినందున వారికి రన్నింగ్ స్పైక్స్, షూస్ వంటివి ఇచ్చి ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారని కోచ్ రామచంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు.

వీఆర్‌ఓల పదోన్నతి జీఓ అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసనలో వీఆర్‌ఓలు

- జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్

విజయనగరం అర్బన్: వీఆర్‌ఓ గ్రేడ్-2 ఉద్యోగుల పదోన్నతులకు సంబంధిం చిన జీఓఎంఎస్ 166ను అమలు చేయాలని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ర్ ఎస్.రామసుందర్‌రెడ్డికి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట విలేకరులతో సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఓ గ్రేడ్-2 నుంచి వీఆర్‌ఓ గ్రేడ్-1 పోస్టుకు పదోన్నతి అవకాశాన్ని 2023 ఏప్రిల్ 3న విడుదల చేసిన జీఓ రూపంలో కల్పించిందని తెలియజేశారు. ఈ ప్రభుత్వం ఆ జీఓను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అర్హులైన వీఆర్‌ఓ గ్రేడ్-2 ఉద్యోగులకు ఈ జీఓ అమలు చేసి పదోన్నతి కల్పించాలని కోరారు. రెండేళ్లుగా అర్హులైన గ్రేడ్-1 వీఆర్‌ఓలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించలేదన్నారు. జిల్లాలో కొన్ని మండలాలల్లో రాజకీయ నాయకుల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయని వాటికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు, సహాధ్యక్షుడు జి.వేణు, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వివిధ మండలాల నుంచి వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

డోలీ గ్రామాల అనుసంధాన మార్గాల నివేదికకు సర్వం సిద్ధం

- డ్వామా పీడీ కె.రామచంద్రరావు

పార్వతీపురంటౌన్: డోలీ గ్రామాల అనుసంధాన మార్గాల పరిశీలనపై నివేదిక కోసం సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అనేక డోలీ గ్రామాలు ఇప్పటికీ రవాణా మార్గాలకు దూరంగా ఉన్నాయని, ఈ గ్రామాలకు ప్రభుత్వ సేవలు, వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలు చేరడానికి అనుసంధానం అత్యవసరమన్నారు. అనుసంధానం లేని డోలీ గ్రామాలకు ప్రవేశ మార్గాలను గుర్తించడం, తక్కువ ఖర్చుతో/ఖర్చు లేకుండా అమలు చేయగల మార్గాలను కనుగొనడం, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం, వెంటనే ప్రతి మండలానికి కనీసం 5 డోలీ గ్రామాలు మొదటి దశలో కవర్ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డోలీ గ్రామాలు సీతంపేట, భామిని, కురుపాం, జి.ఎల్.పురం, కొమరాడ, సాలూరు, పాచిపెంట మండలాల్లో ఉన్నట్లు వివరించారు. ఈ మండలాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అందరినీ మండల స్థాయి బృందాలుగా విభజించినట్లు చెప్పారు. ప్రతి బృందం డోలీ గ్రామాలను ప్రత్యక్షంగా సందర్శించి, అనుసంధాన అవకాశాలను నమోదు చేస్తుందని తెలిపారు. తుది నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు వివరించారు.

లెండికి ఆలిండియా 2వ ర్యాంకు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల ఏఐసీటీఈ ఎడ్‌స్కిల్ వర్చ్యువల్ ఇంటర్న్‌షిప్‌లో ఆలిండియా 2వ ర్యాంకు సాధించింది. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణ, పరిశ్రమ అనుసంధానం కల్పించడంలో లెండి ఇంజినీరింగ్ కళాశాల అగ్రగామిగా నిలిచింది. సిమ్లాలో జరిగిన కార్యక్రమంలో అవార్డును కేంద్ర ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వశాఖకు చెందిన సార్క్ దక్షిణాసియా విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ప్రొ.కేకే అగర్వాల్ చేతుల మీదుగా లెండి ఇంజినీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడి, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబులు అందుకున్నారు. జాతీయస్థాయిలో పెద్ద గుర్తింపు పొందడం గర్వకారణమమని ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తం చేశారు.



సార్క్ దక్షిణాసియా విశ్వవిద్యాలయాల అధ్యక్షుడు అగర్వాల్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న లెండి వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామారెడ్డి తదితరులు

నిరసన హోరు

- రూ.6,400 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి
- విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి
- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యార్థుల ఆందోళన

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వ తీరుపై విద్యార్థిలోకం భగ్గుమంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తూ జారీచేసిన జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేసింది. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను పూర్తిగా మోసం చేసిందని మండిపడ్డారు. జీఓ 107, 108 రద్దు చేస్తామని చెప్పి మిన్నకుందన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు విద్యారంగ సమస్యలపై నిశ్శబ్దంగా ఉండడం సిగ్గుచేటన్నారు. జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల సమస్యలపై చర్చించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి ఎ.సుమన్, విద్యార్థి నాయకులు శంకర్, రాము, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.